సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 21 । జనవరి । 2025



విద్యార్థిని ఆత్మహత్యాయత్నం
గురుకుల పాఠశాల హాస్టల్‌లో ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. - 8లో



చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌!
రామన్నపేట తహసీల్దార్ లాల్‌బహదూర్‌శాస్త్రి నిత్యం చేనేత వస్త్రాలు ధరించి చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌లా నిలుస్తున్నారు. - 8లో



హుండీ ఆదాయం లెక్కింపు
యాదగిరిగుట్ట ఆలయంలో హుండీ ఆదాయం రూ. 4,17,13,596 వచ్చినట్లు ఈ ఓ భాస్కర్ రావు వెల్లడించారు. - 8లో

న్యూస్‌రీల్

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

భువనగిరిటౌన్ : తెలంగాణ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా డైరీ, క్యాలెండర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ గంగాధర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు నాగిరెడ్డి జగన్మోహన్ ప్రసాద్, ధరణికోట భగత్, మహమ్మద్ కదీర్, కె.శ్రీకాంత్, పెండెం శ్రీనివాస్, శశికాంత్ గౌడ్, శైలజ ఆనంద్, కటకం సిద్దేశ్వర్, ఆసిఫ్, మోహన్ కుమార్, శ్రావణ్ కుమార్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశ పరీక్ష షెడ్యూల్ విడుదలైనట్లు యాదాద్రి జోన్ అధికారి సంధ్యారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతిలో మిగిలిపోయిన సీట్లకు, గౌలిదొడ్డి ఎస్సీ సీఓఈ గురుకులంలో 9వ తరగతి, పరిగి ఎస్‌ఓఈలో 8వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రుక్మాపూర్‌లోని ఎస్సీ గురుకుల సైనిక్ స్కూల్, మల్కాజ్‌గిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలు ఉన్నట్లు వెల్లడించారు. అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 1 నుంచి 23వ తేదీలోపు www.tgcet.cgg.gov.inలో ఆన్‌లైన్ ద్వారా రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



బియ్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు

భువనగిరిటౌన్ : అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు సూచించారు. సోమవారం భువనగిరి అర్బన్ పరిధిలోని ఆదర్శనగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించిన గుడ్లు, బియ్యం, బాలామృతం, పాలు నాణ్యత, స్టాకు రిజిస్టర్, హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలింతలకు, గర్భిణులకు, కిశోర బాలికలకు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. సరుకులు పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ టీ.విజయగౌరీ, ఆయా భాగ్యమ్మ ఉన్నారు.

శివ కేశవులకు సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: శివ కేశవులకు నిలయమైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు కొనసాగాయి. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో కొండపైన అనుబంధ ఆలయమైన శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చనలు, మండపంలో స్పటిక లింగానికి పూజలు విశేషంగా నిర్వహించారు. పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకోగా, పూజారులు స్వామి వారి ఆశీస్సులు అందజేశారు. ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులకు సంప్రదాయ పూజలను కొనసాగించారు. ఆలయంలో నిత్య కల్యాణ వేడుక, శ్రీసుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు వంటి పూజలను ఆచార్యులు వైభవంగా జరిపించారు.

కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భువనగిరిటౌన్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కల్లు గీత కార్మికులు సంఘం జిల్లా అధ్యక్షుడు రాగీర్ కృష్ణయ్య అధ్యక్షతన గీత కార్మికులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోలగాని జయరాములు మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా బాధితులకు అందించాలని, ప్రతి గీత కార్మికుడికి సేఫ్టీ మోకులు అందించాలని డిమాండ్ చేశారు. భువనగిరి మండలంలో నందనం గ్రామంలో తాటి ఈత ఉత్పత్తుల శిక్షణ, నీర కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. గీత కార్మికుల రూ.4000 పెన్షన్, సహజ మరణం పొందిన గీత కార్మికుడి కుటుంబానికి రూ.ఐదు లక్షలు వచ్చేలా గీతన్న బీమా పథకం వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో దూపటి వెంకటేష్, గాజుల ఆంజనేయులు, మహేందర్, అశోక్, శ్రీరామమూర్తి, లింగయ్య, మైసయ్య, కొండల్, బావండ్లపల్లి బాలరాజు, పులి భిక్షం, ఎర్ర రవీందర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గీత కార్మికులు

నేటి నుంచి గ్రామసభలు

428 గ్రామ పంచాయతీలు
- 104 మున్సిపల్ వార్డులు
- పాల్గొననున్న ఎమ్మెల్యేలు అయిలయ్య, అనిల్‌కుమార్‌రెడ్డి
- అర్హులుంటే అప్పటికప్పుడు దరఖాస్తుల స్వీకరణ



ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ప్రతిపాదిత జాబితా : 16,297 మంది
ప్రజాపాలన రేషన్‌కార్డుల ప్రతిపాదిత జాబితా : 70,781 యూనిట్లు
అదనపు సభ్యుల చేరికల ప్రతిపాదిత జాబితా: 43,620 యూనిట్లు
పక్కా ఇల్లు లేకుండా ఇంటి స్థలం ఉన్నవారి ప్రతిపాదిత జాబితా : 56,964 మంది
పక్కా ఇల్లు, ఇంటి స్థలం లేని వారి ప్రతిపాదిత జాబితా : 22,397 మంది

సాక్షి, యాదాద్రి : రిపబ్లిక్‌డే సందర్భంగా ఈ నెల 26 నుంచి ప్రభుత్వం ప్రారంభించనున్న నాలుగు పథకాల కోసం గ్రామ సభలను మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు 428 గ్రామ పంచాయతీలు, 104 మున్సిపల్ వార్డుల్లో గ్రామ, వార్డు సభల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. తొలిరోజు జిల్లాలోని 115 గ్రామ పంచాయతీలు, 25 మున్సిపల్ వార్డుల్లో గ్రామ సభలను నిర్వహిస్తారు. కలెక్టర్ ఎం.హనుమంతరావు గ్రామ సభల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

అర్హుల నుంచి దరఖాస్తులు

గ్రామ సభలో ప్రవేశపెట్టే జాబితాలో అర్హత ఉండి పేరు లేని వారి నుంచి వెంటనే దరఖాస్తులు తీసుకుంటారు. ఇందుకోసం గ్రామసభ జరిగే చోటనే ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేస్తారు. రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలు కోసం అర్హులైన లబ్ధిదారుల జాబితాలను అధికారులు నాలుగు రోజులుగా సర్వే చేసి రూపొందించారు. నేటి నుంచి జరిగే గ్రామ, మున్సిపల్ వార్డు సభల్లో జాబితాలను ప్రదర్శిస్తారు. వాటిపైన అభ్యంతరాలు ప్రజల నుంచి వస్తే స్వీకరిస్తారు. ఇంకా ఎవరైనా అర్హుల పేర్లు జాబితాలో లేకుంటే వెంటనే వారి నుంచి ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరిస్తారు.

గ్రామ సభల్లో ఎమ్మెల్యేలు..

గ్రామ, మున్సిపల్ వార్డుల్లో నిర్వహించే సభల్లో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. తొలి రోజు ఆలేరు, రాజాపేట మండలాల్లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, పోచంపల్లి, జలాల్‌పూర్‌లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి పాల్గొంటారు. 24వ తేదీ లోపు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏదేని గ్రామసభలో పాల్గొంటారు.

ప్రత్యేక టీమ్‌ల ఏర్పాటు

గ్రామ సభల నిర్వహణకోసం ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేక అధికారుల తోపాటు, రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సి పల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొంటారు. ప్రతిరోజు ఐదు నుంచి ఆరేడు గ్రామాలు, 25 మున్సిపల్ వార్డుల చొప్పున గ్రామ సభలు నిర్వహించనున్నారు.

ప్రాథమిక జాబితా

ఈ నెల 16 నుంచి 20 వరకు చేపట్టిన సర్వేలో నాలుగు పథకాలకు సంబంధించిన ప్రాథమిక జాబితాలను అధికారులు రూపొందించారు. వీటిని గ్రామ సభలో చదవి వినిస్తారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనులను 20 రోజుల నుంచి ఆపై పనిచేసిన కూలీలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో లబ్ధిదారులుగా 16,297 మందిని గుర్తించారు. రేషన్‌కార్డుల కోసం ప్రతిపాదిత జాబితా 70,781, అదనపు సభ్యుల చేరికల కోసం 43,620 మంది ప్రతిపాదిత జాబితా రూపొందించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం పక్కా ఇళ్లు(పెంకుటిల్లు, రేకుల ఇల్లు, పూరి గుడిసె) లేకుండా ఇంటి స్థలం ఉన్న వారు 56,964మంది, పక్కా ఇళ్లు లేకుండా ఇంటి స్థలం లేని వారు 22,397 మందిని గుర్తించారు. కొండలు, గుట్టలు, నాలా కన్వర్షన్ భూములు, వివిధ ప్రజోపయోగాల కోసం సేకరించిన భూములు సుమారు 20 వేల ఎకరాలను గుర్తించారు.

అర్హులు గ్రామసభలో దరఖాస్తు చేసుకోవచ్చు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి జాబితాలో పేరు లేని వారు గ్రామ సభలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులతో కలిసి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల్లో లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో చదివి వినిపించాలని, అభ్యంతరాలుంటే దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గ్రామ సభల తీర్మాన ప్రతులను భద్రపరచాలని సూచించారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి అనితారామచంద్రన్



గ్రామస్తులతో మాట్లాడుతున్న అనితారామచంద్రన్

బీబీనగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకు అందేలా పారదర్శకంగా సర్వే చేపట్టాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రత్యేక అధికారి అనితారామచంద్రన్ అన్నారు. బీబీనగర్ మండలంలోని మహదేవ్‌పురం, మక్తా అనంతారం గ్రామాల్లో కొనసాగుతున్న రైతు భరోసా, రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సోమవారం కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువులో మునిగి ఉన్న భూములకు రైతు భరోసా వర్తింపచేయవద్దని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని అధికారులకు సూచించారు. వెంచర్లు, గుట్టలు కలిగి ఉన్న భూములను రైతు భరోసా పథకం నుంచి తొలగించనున్నట్లు తెలిపారు. తప్పిదాలకు తావు లేకుండా సర్వే విషయాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆమె వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, సివిల్ సప్లయ్ అధికారి వనజాత, మండల ప్రత్యేకాధికారి సుభాషిణి ఉన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

- కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. సోమవారం మినీ మీటింగ్ హాల్‌లో అన్ని శాఖల అధికారులతో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ తో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడుకలు నిర్వహించనున్నందున వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతిబింబించేలా స్టాల్స్, శకటాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ రాహుల్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామాంజులారెడ్డి వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అనర్హులను జాబితా నుంచి తొలగించాలి



మాటూర్ గ్రామంలో సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

మోటకొండూర్: సాగుకు యోగ్యంకాని భూములను జాబితా తొలగించి అనర్హులు రైతు భరోసా పొందకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులకు సూచించారు. సోమవారం మోటకొండూర్ మండలంలోని మాటూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు మండలంలో చేపట్టిన సర్వే వివరాలను తెలుసుకున్నారు. మండల ప్రత్యేక అధికారి డీసీఓ శ్రీధర్, తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీఓ ఇందిర, ఏఓ రమాదేవి, ఆర్ఐ రామారావు, సర్వేయర్ శివకుమార్, ఏఈఓలు శివాణి, సంధ్య ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు భయపడే రైతు దీక్షకు అనుమతివ్వలేదు

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత

యాదగిరిగుట్ట: రైతుల కోసం బీఆర్‌ఎస్ చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడి నల్లగొండలో మంగళవారం నిర్వహించనున్న కేటీఆర్ రైతు దీక్షకు అనుమతులు ఇవ్వలేదని మాజీ ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట బీఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బంధు ఇచ్చిన ప్రతి రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పోలీసులు ఎన్ని కుట్రలు చేసినా రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఖలీల్, గంగుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, పాపట్ల నరహరి, కసావు శ్రీనివాస్‌గౌడ్, మిట్ట వెంకటయ్య, ముక్కెర్ల సతీష్, సంపత్ తదితరులున్నారు.

ఆకస్మిక తనిఖీ

రాజాపేట : విద్యార్థులు తమ లక్ష్య సాధనకు కృషిచేయాలని జిల్లా విద్యాధికారి సత్యనారాయణ సూచించారు. సోమవారం రాజా పేట మండలంలోని దూదివెంకటాపురం ఉన్నత పాఠశాలను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 9, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వారి సామర్థ్యాన్ని పరిశీలించి, లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు విజయ, ఉపాధ్యాయులు ఉన్నారు.

అండర్ పాస్ నిర్మించాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణంలోని ఐటీఐ వద్ద జాతీయ రహదారిపై అండర్ పాస్ నిర్మించాలని కోరుతూ అండర్ పాస్ నిర్మాణ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు కొలుపుల అమరేందర్ పాల్గొని మాట్లాడుతూ భువనగిరి ప్రభుత్వ ఐటీఐ దగ్గర నేషనల్ హైవే దాటడానికి రామకృష్ణాపురం, పెంచికల్ పహాడ్‌తోపాటు నాలుగు మండలాలకు చెందిన 40 గ్రామాలకు పైగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికే 20 మందికి పైగా చనిపోయారని, 80 మందికి పైగా గాయపడి దివ్యాంగులుగా మారారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర మాజీ కార్యదర్శి బట్టు రామచంద్రయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు, జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ, అండర్ పాస్ నిర్మాణ సాధన కమిటీ కన్వీనర్ సిల్వేరు ఎల్లయ్య, కో కన్వీనర్లు మందడి సిద్ధారెడ్డి, కంచి మల్లయ్య, సిల్వేరు మధు, కళ్లెం సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జనగాం పాండు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, సీపీఎం భువనగిరి పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అన్నంపట్ల కృష్ణ, అబ్బగాని వెంకటేశం, భువనగిరి మండలం మాజీ ఎంపీపీ కేశపట్నం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ నమోదు 10 శాతమే!

- విద్యార్థి, తల్లిదండ్రుల పేర్లలో తప్పులు
- మందకొడిగా కొనసాగుతున్న అపార్ ప్రక్రియ
- ఈనెల 31 వరకు తుది గడువు
- వార్షిక పరీక్షలపైనే దృష్టి సారించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు
- గడువులోపు పూర్తయ్యేనా?



పాఠశాలలు, కాలేజీలు	231
విద్యార్థులు	1,14,548
నమోదు	11,851

భువనగిరి : రెండో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి విద్యార్థికి గుర్తింపుకార్డు జారీకోసం చేపట్టిన ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)కి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈనెల 31వరకు వివరాల నమోదు పూర్తి చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు కేవలం 10 శాతం మాత్రమే పూర్తయ్యింది. విద్యార్థి పుట్టిన తేదీ, పేరు, తల్లిదండ్రుల పేర్లలో తప్పులు ఉండడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. తల్లిదండ్రులు సహకరించినచోట కొంతవరకు నమోదు ప్రక్రియ ముందుకు సాగుతుండగా, మిగిలిన చోట్ల ఉపాధ్యాయులు కుస్తీ పట్టాల్సి వస్తోంది.

కార్డులో విద్యార్థుల సమగ్ర సమాచారం

వన్ నేషన్ వన్ స్టూడెంట్ నినాదంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అపార్ నమోదు చేపట్టారు. ఈ ప్రక్రియను గత ఏడాది సెప్టెంబరు నెలాఖరు నుంచి ప్రారంభించారు. వివరాల నమోదుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉంది. ఇది పూర్తయితే ప్రతి విద్యార్థికి 12 అంకెలతో గుర్తింపు నంబర్ రానుంది. ఇది విద్యార్థుల భవిష్యత్‌కు ప్రామాణికం కానుంది. ఉన్నత చదువులు, ఇంటర్వ్యూలు తదితర వాటికి 12 అంకెల నంబర్ ఉపయోగించి దరఖాస్తు చేసుకునేలా రూపొందించారు.

11,851 మంది విద్యార్థుల వివరాలు నమోదు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్ కళాశాలలు 1,231 వరకు ఉన్నాయి. వీటిలో 1,14,548 మంది విద్యార్థులు ఉండగా ఇప్పటి వరకు 11,851 మంది విద్యార్థుల వివరాలు నమోదు చేశారు. అపార్ నమోదు ప్రారంభించని పాఠశాలలు, కళాశాలలు కూడా ఉండటం గమనార్హం. ప్రధానంగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల నిర్వాహకులు అపార్‌ను పట్టించుకోవడం లేదు.

ప్రధాన సమస్యలు ఇవీ..

- అపార్ నమోదుకు విద్యార్థుల ఆధార్ వివరాలతో పాటు తల్లిదండ్రుల అనుమతి ఉండాలి. యూడైసీలో ఇప్పటికే ఉన్న విద్యార్థులు పర్మనెంట్ ఎన్‌రోల్‌మెంట్ నంబర్ వివరాలకు సరిపోకపోవడంతో అసలు సమస్య ఏర్పడుతుంది. చాలా మంది విద్యార్థుల వ్యక్తిగత వివరాలకు, ఆధార్‌లోని సమాచారానికి సరిపోలడం లేదు. దీంతో ఆధార్‌లో పేరు మార్పులు, అక్షరాల్లో తప్పులను సరి చేయాల్సి ఉంది. ఇందుకోసం ధ్రువీకరణ పత్రాలను జతచేయడం తప్పనిసరిగా మారింది. ఈ విషయంలో టెన్త్ మార్కుల మెమో, బోనోఫైడ్‌తో పాటు జనన ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలి. కాని ఈ ప్రక్రియ సకాలంలో జరగక నమోదు జాప్యం జరుగుతుంది.
- తల్లిదండ్రులు వారి పిల్లలకు సంబంధించిన వివరాలు, అంగీకార పత్రాలు ఉపాధ్యాయులకు సకాలంలో అందించడం లేదు.
- ఉపాధ్యాయులకు అవగాహన లేకపోవడంతో నమోదులో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఇంటర్ కళాశాలల్లో వార్షిక పరీక్షల పైనే దృష్టి పెట్టడంతో నమోదు కావడం లేదు.
- ఎమ్మార్సీల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు చాలా రోజులు సమ్మెలో ఉండటం, ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఆపరేటర్లు లేకపోవడం నమోదు అలస్యానికి కారణంగా చెప్పవచ్చు.

గడువులోపు పూర్తి చేస్తాం

ప్రతి విద్యార్థికి అపార్ నమోదు చేయాల్సిందే. ఈ ప్రక్రియ కొనసాగుతోంది. సాంకేతి లోపాలున్నాయి. వాటిని అధిగమించి నమోదు పూర్తి చేయిస్తాం. పండుగ సెలవులు రావడం, సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది సమ్మె చేయడం వల్ల ప్రక్రియ నెమ్మదించింది. నిర్ణీత గడువులోపు పూర్తి చేస్తాం.

– సత్యనారాయణ, డీఈఓ

యూరియా కోసం రైతుల బారులు

రాజాపేట : వరినాట్లు ప్రారంభం కావడంతో యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈసారి ప్రైవేట్ ఏజెన్సీలకు యూరియా సరఫరా నిలిపివేశారు. కాగా సోమవారం రాజాపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి యూరియా వచ్చింది. సమాచారం అందుకున్న మండలంలోని ఆయా గ్రామాల రైతులు కార్యాలయానికి భారీగా చేరుకుని యూరియా కోసం బారులుదీరారు.



రాజాపేటలో యూరియా కోసం బారులుదీరిన రైతులు

క్లుప్తంగా

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలు

మునగాల: సూర్యాపేట పట్టణంలోని కొత్త వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మంగళవారం అండర్-11, 14, 17 విభాగాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ ఆజాంబాబా సోమవారం మునగాలలో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు తాము చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకంతో కూడిన బోనఫైడ్ సర్టిఫికెట్‌తో ఉదయం 9గంటలకు హాజరు కావాలని సూచించారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి


కావ్య (ఫైల్)

రాజాపేట: విష పురుగు కరవడంతో అనారోగ్యానికి గురైన బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. ఈ ఘటన రాజాపేట మండలం నెమిల గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నెమిల గ్రామానికి చెందిన వేముల మహేందర్‌గౌడ్, లలిత దంపతులకు ముగ్గురు కుమార్తెలు సంతానం. చిన్న కుమార్తె కావ్య స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. శుక్రవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని వ్యవసాయ బావుల వద్దకు రేగుపండ్ల కోసం చిన్న బాబుతో కలిసి కావ్య వెళ్లింది. చెట్టు కింద పడ్డ రేగుపండ్లు తీస్తున్న క్రమంలో కావ్య చేతికి విష పురుగు కరిచింది. కావ్య గమనించకుండా చేతికి ముళ్లు కుచ్చుకుందేమో అని అనుకుంది. ఇంటికి వెళ్లాక రాత్రి 7గంటల సమయంలో తనకు వాంతి వస్తుందని తల్లితో కావ్య చెప్పడతో స్థానికంగా చికిత్స చేయించారు. శనివారం తెల్లవారుజామున కావ్య నోటి నుంచి నురగలు వస్తుండటంతో తల్లిదండ్రులు ఆమెను రాజాపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మొదట భువనగిరికి అక్కడి నుంచి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

మోత్కూరు : ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయ సమీపంలో రేకుల ఇంట్లో మెండె అండాలు నివాసముంటోంది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆమె ఆదివారం రాత్రి తన కుమారుడి ఇంట్లో నిద్రించేందుకు వెళ్లింది. ఈ క్రమంలో అర్ధరాత్రి వేళఅండాలు ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు కూలిపోయి వస్తువులన్నీ కాలిపోయాయి. కూలి పనిచేసి దాచుకున్న రూ.18 వేల నగదు, తులంన్నర బంగారం మంటల్లో కాలిపోయాయని బాధితురాలు పేర్కొంది. ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలు చల్లార్చినప్పటికీ అప్పటికే ఇల్లు మొత్తం కాలిబూడిదయ్యింది.

చోరీలకు పాల్పడుతున్న యువకుల అరెస్ట్

- గంజాయి కూడా విక్రయిస్తున్న నిందితులు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

రామగిరి(నల్లగొండ): గంజాయి విక్రయంతో పాటు చోరీలకు పాల్పడుతున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి సోమవారం విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం నామనాయక్ తండాకు చెందిన కొడావత్ విక్రమ్, కొండమల్లేపల్లి మండలం దంజిరాల్‌తండాకు చెందిన వడ్త్య నాగరాజు, మిర్యాలగూడ మండలం కాల్వలపల్లికి చెందిన ధనావత్ సందీప్‌నాయక్, యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం తుంబాయితండాకు చెందిన జరుప్లా నవీన్‌కుమార్ కలిసి రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని బంజారా కాలనీలో ఉంటున్నారు. గంజాయికి అలవాటు పడిన వీరు నలుగురు తాళం వేసిన ఇళ్లతో పాటు వాహనాలు చోరీ చేస్తున్నారు. సోమవారం ఉదయం నార్కట్‌పల్లి సమీపంలోని మద్రాస్ ఫిల్టర్ కాఫీ సమీపంలో గంజాయి అమ్మేందుకు వచ్చారు. సమాచారం అందుకున్న నార్కట్‌పల్లి ఎస్‌ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో అక్కడకు వెళ్లి అనుమానాస్పదంగా కనిపించిన వీరి నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. హైదరాబాద్‌లోని ధూల్‌పేటలో గంజాయి కొనుగోలు చేసి దొంగిలించిన వాహనాల్లో వచ్చి మహాత్మాగాంధీ యూనివర్సిటీ, కామినేని మెడికల్ కాలేజీ విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. కొడావత్ విక్రమ్‌పై 20 కేసులు, వడ్త్య నాగరాజుపై 11 కేసులు, ధనావత్ సందీప్‌నాయక్‌పై 23 కేసులు, జరుప్లా నవీన్‌కుమార్‌పై 9 కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో 4 కేసులు, చౌటుప్పల్ పీఎస్‌లో 3 కేసులు, వనస్థలిపురం పీఎస్‌లో 1 కేసు, సరూర్‌నగర్ పీఎస్‌లో 1 కేసులు ఉన్నాయని, వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. డీఎస్పీ శివరాంరెడ్డి, నార్కట్‌పల్లి సీఐ కె. నాగరాజు, ఎస్‌ఐ క్రాంతికుమార్, ఏఎస్‌ఐ ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ రాము, కానిస్టేబుళ్లు సత్యనారాయణ, అఖిల్, గిరిబాబు, తిరుమల్, శివశంకర్, మహేష్, హరిప్రసాద్, సాయికుమార్‌ను నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

గురుకుల హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

సూర్యాపేటటౌన్ : గురుకుల పాఠశాల హాస్టల్‌లో ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండలానికి కేటాయించిన మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో బీబీగూడేనికి చెందిన హర్షిత తొమ్మిదో తరగతి చదువుతోంది. సంక్రాంతి సెలవులకు ఊరెళ్లిన హర్షితను సోమవారం ఉదయం ఆమె తల్లిదండ్రులు తిరిగి పాఠశాలకు తీసుకొచ్చి వదిలిపెట్టారు. పాఠశాలలోకి వచ్చిన అనంతరం తన లగేజ్ బ్యాగులను హాస్టల్ రూంలో ఉంచిన హర్షిత చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. తోటి విద్యార్థులు గమనించి హాస్టల్ సిబ్బందికి సమాచారం అందించారు. హాస్టల్ సిబ్బంది హుటాహుటిన హర్షితను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. సంక్రాంతి సెలవులు ముగియడంతో హర్షితను పాఠశాలకు రావాల్సిందిగా ఆమె తల్లిదండ్రులకు పాఠశాల సిబ్బంది ఫోన్ చేశారని, పాఠశాలకు పంపిన కొద్ది సమయంలోనే ఆత్మహత్యాయత్నం చేయడంతో కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు పాఠశాల ప్రిన్సిపాల్ వేధింపులే కారణమని, దీనిపై విచారణ చేయాలని హర్షిత తల్లిదండ్రులు వల్లపు సైదులు, సరిత డిమాండ్ చేస్తున్నారు. అయితే హర్షిత అనారోగ్య సమస్యలతోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉండొచ్చని పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఆమె హాజరుశాతం కూడా తక్కువగా ఉంటుందని ప్రిన్సిపాల్ చెప్పారు. విద్యార్థిని పాఠశాలలో సిబ్బంది ఎవరూ ఇబ్బంది పెట్టలేదన్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసుతెలిపారు. ఆత్మహత్యాయత్నానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

హైదరాబాద్ కిడ్నీ సెంటర్ వైద్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి మృతి


ఎర్రబోతు విష్ణువర్ధన్‌రెడ్డి (ఫైల్)

చౌటుప్పల్ : హైదరాబాద్‌మలక్‌పేటలోని హైదరాబాద్ కిడ్నీ సెంటర్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ ఎర్రబోతు విష్ణువర్ధన్‌రెడ్డి(68) సోమవారం మృతి చెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లోని తంగడపల్లి గ్రామానికి చెందిన ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం స్థానికంగానే జరిగింది. వైద్య వృత్తిలోకి వచ్చాక సొంతంగా ఆస్పత్రి ఏర్పాటు చేసుకున్నారు. ఎంతో మంది కిడ్నీ రోగులకు వైద్య సేవలందించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సోమవారం ఉదయం మృతిచెందారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి విష్ణువర్ధన్‌రెడ్డికి నివాళులు అర్పించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 14 తులాల బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

నల్లగొండ: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన నల్లగొండ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో సోమవారం వెలుగులోకి వచ్చింది. టూటౌన్ ఎస్‌ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ కాలనీలో నివాసముంటున్న బీఎస్‌ఎన్‌ఎల్ రిటైర్డ్ సూపరింటెండెంట్ మేకల ప్రసాద్ కుమార్తె అమెరికాలో, కుమారుడు ఢిల్లీలో స్థిరపడ్డారు. సంక్రాంతి పండుగకు ప్రసాద్ కుమార్తె అమెరికా నుంచి నల్లగొండకు వచ్చింది. పండుగ తర్వాత ఈ నెల 17న కుమార్తె తిరిగి అమెరికాకు వెళ్తుండడంతో ఆమెను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దించేందుకు ప్రసాద్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లారు. కుమార్తెను ఎయిర్‌పోర్టులో దించిన అనంతరం రెండు రోజులు హైదరాబాద్‌లోనే తమ బంధువుల ఇంట్లో ప్రసాద్ కుటుంబ సభ్యులు ఉన్నారు. సోమవారం వారు నల్లగొండలోని ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి, తలుపులు తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా.. 14 తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీంలతో వచ్చి వేలిముద్రలు సేకరించారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ రాఘవరావు పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొట్టడంతో విరిగిన విద్యుత్ స్తంభం

చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామ చౌరస్తాలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని లారీ వేగంగా వచ్చి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం కింది భాగంలో విరిగిపోయింది. లారీ బలంగా ఢీకొట్టడంతో స్తంభానికి ఉన్న సర్వీస్ వైర్లు, కేబుల్ వైర్లతో పాటు ఇతర స్తంభాల నుంచి ఉన్న విద్యుత్ లైన్ తెగిపోయింది. సోమవారం ఉదయం వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రత్యామ్నాయంగా మరో స్తంభం ఏర్పాటు చేసి వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

యాదగిరీశుడి హుండీ ఆదాయం లెక్కింపు


హుండీల్లోని నగదు లెక్కిస్తున్న ఆలయాధికారులు, సిబ్బంది


హుండీల్లో వచ్చిన విదేశీ కరెన్సీ

- 47 రోజులకు రూ.4.17కోట్లు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ ఆదాయం రూ.4,17,13,596 వచ్చినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు వెల్లడించారు. హుండీల్లోని నగదు, నగలను సోమవారం కొండకు దిగువన శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో అధికారులు, సిబ్బంది లెక్కించారు. ఇందులో నగదు రూ.4,17,13,596 రాగా, మిశ్రమ బంగారం 228 గ్రాములు, మిశ్రమ వెండి 7కిలోల 50 గ్రాములు వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. అంతేకాకుండా అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, యూఏఈ, నేపాల్, సౌదీ అరేబియా, సింగపూర్, ఖతార్, ఒమాన్, కెనడా, మలేషియా, బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్, శ్రీలంక, జార్జియా, థాయిలాండ్, ఇండోనేషియా తదితర దేశాలకు చెందిన కరెన్సీ వచ్చినట్లు తెలిపారు. ఈ ఆదాయం 47 రోజులదని చెప్పారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు

రామన్నపేట : రామన్నపేట మండలం ఇస్కిళ్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు సోమవారం రామన్నపేట నుంచి చిట్యాల రైలు మార్గంలో రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లగా.. స్థానికులు గమనించి డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పెట్రోలింగ్ వాహనంలో పోలీసులు అక్కడికి వెళ్లి ఆ యువకుడిని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామానికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

మునగాల: మునగాల మండల పరిధిలోని కృష్ణానగర్-బరాఖత్‌గూడెం గ్రామాల మధ్య నడిగూడెం రోడ్డుపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన కర్నె నగేష్ జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి బైక్‌పై కృష్ణానగర్ నుంచి స్వగ్రామం వస్తుండగా.. మార్గమధ్యలో బైక్ అదుపుతప్పడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న నగేష్ కుటుంబ సభ్యులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఈ తహసీల్దార్.. చేనేతకు బ్రాండ్ అంబాసిడర్ !

- నిత్యం చేనేత వస్త్రాలు ధరించి విధులకు హాజరు
- ఈయన పేరు లాల్‌బహదూర్‌శాస్త్రి
- అన్న పేరు జవహర్‌లాల్ నెహ్రూ


చేనేత దుస్తులతో విధులకు హాజరైన లాల్‌బహదూర్‌శాస్త్రి

రామన్నపేట: చేనేత వస్త్రాలకు ప్రాచుర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు వారంలో ఒకరోజు చేనేత వస్త్రాలు ధరించాలనే నిబంధన ఉంది. దీనిని అనుసరిస్తూ రామన్నపేట తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న చిలుకూరి లాల్‌బహదూర్‌శాస్త్రి నిత్యం చేనేత వస్త్రాలు ధరించి విధులకు హాజరవుతూ చేనతకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలుస్తున్నారు. చేనేత కుటుంబం నుంచి వచ్చిన తనకు చేనేత వస్త్రాలు ధరించడమంటే చాలా ఇష్టమని తెలిపారు. సిరిపురం, వెల్లంకి గ్రామాల్లో చేనేత కార్మికులు తయారుచేసిన క్లాత్ కొని ఇరవైకి పైగా చొక్కాలు కుట్టించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దేశ నాయకుల పేర్లు పెట్టిన తండ్రి

తహసీల్దార్ లాల్‌బహదూర్ శాస్త్రి స్వస్థలం దేవరకొండ టౌన్ కాగా.. ఆయన తండ్రి చిలుకూరి విశ్వం, తల్లి రంగమ్మ దంపతులకు ఆరుగురు సంతానం. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన తన తండ్రికి దేశభక్తి భావాలు ఎక్కువని, భారత మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మృతిచెందినప్పుడు తన అన్న జన్మించడంతో ఆయనకు జవహర్‌లాల్ నెహ్రూ అని, రెండో ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి మృతిచెందినప్పుడు తాను జన్మించడంతో తనకు లాల్‌బహదూర్‌శాస్త్రి అని పేరు పెట్టినట్లు ఆయన చెప్పారు.

సంక్రాంతి పండుగకు వెళ్లొస్తూ..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చిట్యాల: సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి వెళ్లి తిరిగి హైదరాబాద్‌కు వస్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో సోమవారం జరిగింది. చిట్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా ముసునూరు మండలం చిల్లబోయినపల్లి గ్రామానికి చెందిన జువ్వనపూడి విక్రమ్(26) కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి వెళ్లిన విక్రమ్ సోమవారం బైక్‌పై తిరిగి హైదరాబాద్‌కు పయనమయ్యాడు. మార్గమధ్యలో చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వచ్చిన బొలేరో వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విక్రమ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, మృతుడి సోదరి విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చిట్యాల ఎస్‌ఐ ధర్మా తెలిపారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండలం పరిధిలోని ధర్మారం గ్రామ పంచాయతీకి చెందిన మందుల శ్రీకాంత్ అదే గ్రామంలో కొత్తగా చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆదివారం బైక్‌తో ధ్వంసం చేశాడు. దీంతో అతడిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత


అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం

వలిగొండ: వలిగొండ మండలం టేకులసోమారం గ్రామ పంచాయతీ పరిధిలోని పనుమటివారిగూడెంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు సోమవారం పట్టుకుని సీజ్ చేశారు. పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పనుమటివారిగూడేనికి చెందిన కిరాణా వ్యాపారి కొడితాల వెంకటేశం చుట్టుపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని సేకరించి తన ఇంట్లో నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పౌరసరఫరాల శాఖ అధికారి బాలమణిలా ఆధ్వర్యంలో సోమవారం వెంకటేశం ఇంటిపై దాడులు చేసి సుమారు 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. పౌరసరఫరాల శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేశంపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

ట్యాంకర్ బోల్తా పడి యువకుడు మృతి

మోత్కూరు: గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తాపడడంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మోత్కూరు మండలం రాగిబావి గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాగిబావి గ్రామానికి చెందిన రాంపాక సోమయ్య, లక్ష్మి దంపతుల కుమారుడు ఉపేందర్(26)కు వివాహం కాలేదు. సోమవారం గ్రామంలో ఓ వ్యక్తి మృతిచెందగా.. అతడి అంత్యక్రియల కోసం శ్మశానవాటిక వద్దకు గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్‌ను తీసుకెళ్లారు. అంత్యక్రియల అనంతరం ఆ వాటర్ ట్యాంకర్‌ను ఉపేందర్ గ్రామంలోకి తీసుకొస్తుండగా.. మార్గమధ్యలో అదుపుతప్పి బోల్తాపడడంతో మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

సేవాలాల్ జయంతిని సెలవురోజుగా ప్రకటించాలి

భువనగిరిటౌన్: సేవాలాల్ జయంతిని సెలవు రోజుగా ప్రకటించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ధీరావత్ రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం భువనగిరి పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గోర్ బోలి'ని లంబాడీ భాషగా గుర్తించాలన్నారు. లంబాడీల భాష 'గోర్ బోలి'ని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ధరావత్ రాజునాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములునాయక్, పట్టణ అధ్యక్షుడు మోహన్‌నాయక్, ఉద్యోగాల సంఘం జిల్లా నాయకులు నరసింహనాయక్, జిల్లా నాయకులు, దేవేందర్‌నాయక్, గుగులోత్ హచ్చు నాయక్, నాగేశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అందంగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రమ్యంగా రక్తికట్టించారు. కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగళ్యధారణ, తలంబ్రాల మహోత్సవం నిర్వహించారు. అనంతరం కల్యాణంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయి సాగులో మెళకువలు

పాడిపంట



పెద్దవూర: సరైన నీటి వసతి ఉంటే అన్ని కాలాలు బొప్పాయి సాగు అనుకూలమని, బొప్పాయి సాగుతో మంచి ఆదాయం ఆర్జించవచ్చని ఉద్యానవన శాఖ అధికారి మురళి పేర్కొన్నారు. బొప్పాయి సాగు గురించిన సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

అనుకూలమైన నేలలు : నీటి నిల్వ సారవంతమైన తేలికపాటి నల్లరేగడి నేలలు, ఎర్రగరప నేలలు బొప్పాయి సాగుకు అనుకూలంగా ఉంటాయి. నీరు నిలిచే నేలలు, చౌడు, ఆమ్ల నేలలు పనికిరావు.

బొప్పాయి రకాలు : ఏక లింగాశ్రయ, ద్విలింగాశ్రయ జాతి. వీటిలో ఆడ, మగ పుష్పాలు వేర్వేరుగా పూసే మొక్కలు ఉంటాయి. వీటిలో వాషింగ్టన్, సోలో, పూసా డెలిషియస్, పూసా జెయింట్, రైజ్ సోలో, సూర్య, కో-రకంలో 1,2,3,4,5,6,7 అనే రకాలు ఉన్నాయి.

విత్తనాల ప్రవర్థనం(అభివృద్ధి) : బొప్పాయి పండు నుంచి తీసి ఆరబెట్టిన విత్తనాలను 45 రోజుల్లోగా విత్తుకోవాలి. హైబ్రిడ్ రకాల నుంచి తీసిన విత్తనాలను ప్రవర్ధనానికి వినియోగించరాదు.

విత్తుకునే విధానం : ఎకరానికి 200 గ్రాముల వరకు విత్తనాలు సరిపోతాయి. విత్తనాలను తగినంత 150 గేజ్ మందం కలిగిన పాలిథిన్ సంచుల్లో పశువుల ఎరువు, ఇసుక కలిపిన మట్టితో కలిపి నాటాలి.

నీటిని అందించే విధానం : మొక్కల మొదళ్ల వద్ద నీరు తగలకుండా, నీరు నిల్వ ఉండకుండా పిల్ల పాదులు తయారు చేసి నీటిని పారించాలి. డ్రిప్ ద్వారా అయితే చిన్న మొక్కలకు రెండ్రోజులకు ఒకసారి ఎనిమిది లీటర్ల నీటిని, పెద్ద మొక్కలకు వేసవిలో ప్రతిరోజు 20 నుంచి 25 లీటర్ల నీటిని అందించే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి. వర్షాకాలంలో అయితే అవసరాన్ని బట్టి నీటి తడులు అందించాలి.

నాటుకునే విధానం : భూమిని తగినంత తడి ఉన్నప్పుడు 30-40 సెంటీమీటర్ల లోతుగా మెత్తగా దున్నుకోవాలి. మొక్కల మధ్య ఎటు చూసినా 1.8 మీటర్ల దూరం ఉండేలా తగినంత గుంతలు తీసి సిద్ధం చేసుకోవాలి. ప్రతీ గుంతలో 5 కిలోల పశువుల ఎరువు, కిలో వేపపిండి, 20 గ్రాముల అజోస్పైరిల్లం, 20 గ్రాముల ఫాస్ఫో బాక్టీరియా వేసి బాగా కలిపి గుంతలను నింపాలి. అనంతరం 45 నుంచి 60 రోజులు కలిగిన బొప్పాయి మొక్కలను సాయంత్రం పూట మాత్రమే గుంతల్లో నాటుకోవాలి.

తెగుళ్లు – నివారణ చర్యలు

1. కాండం మొదలు కుళ్లు తెగులు : బొప్పాయి చెట్లకు ఈ తెగులు సోకితే వేర్లు, మొదలు మెత్తగా మారి కుళ్లిపోతాయి. ఈ తెగులు కాయలు కలిగిన బొప్పాయి చెట్లను ఆశించి తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. ఈ తెగులు నివారణకు మొక్కల మొదళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలి. లీటర్ నీటికి 2 గ్రాములు అలియేట్ కలిపి మొదలు తడపాలి. వారం వ్యవధిలో రెండు నుంచి మూడసార్లు తడపాలి.

2. బూడిద తెగులు : బొప్పాయి ఆకులపై, లేత చిగుళ్లపై కాండంపైన తెల్లటి బూడిదలాంటి శిలీంద్రం ఏర్పడుతుంది. దీని నివారణకు లీటర్ నీటికి 2 మి.లీ. నీటిని కలిపి పిచికారీ చేయాలి.

3. ఆకుమచ్చ తెగులు : బొప్పాయి ఆకులపై గోధుమ వర్ణపు మచ్చలు ఏర్పడి ఆకులు పసుపురంగుకు మారి ఎండిపోతాయి. వీని నివారణకు క్లోరోథాలోనిన్ 2 గ్రాములు కలిపి పక్షం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

4. కాండం కుళ్లు తెగులు : బొప్పాయి చెట్ల కాండం మొదలు కుళ్లిపోయి జిగురు లాంటి ద్రవం కారుతుంది. దీంతో చెట్లు వాలిపోతాయి. దీని నివారణకు కిలో ట్రైకోడెర్మా విరిడి శిలీంద్రంతో పాటు 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి, ఒక కిలో బెల్లం నీటిని 10 రోజుల పాటు మండె కట్టి చెట్ల పాదుల్లో వేసుకోవాలి.

5. ఆకుముడత తెగులు : ఈ తెగులు కారణంగా ఆకులన్నీ ముడుచుకుపోతాయి. కాయల ఆకారం వంకరటింకరగా మారుతాయి. దీంతో సాగుబడి తగ్గిపోతుంది. అంతర్వాహిక కీటక నాశనులను ఉపయోగించి వైరస్ ద్వారా సంభవించు తెగుళ్లను అరికట్టవచ్చు.

6. పండు ఈగ తెగులు : పక్వానికి వచ్చిన కాయలను ఆశించి తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. కాయలోని గుజ్జును తినివేయడం వలన కాయలు మెత్తబడి కుళ్లిపోతాయి. దీని నివారణకు బొప్పాయి తోటలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. చెట్లకింద పడిపోయిన పండ్లను ఏరి నాశనం చేయాలి. లీటర్ నీటికి ఒక మిల్లీలీటర్ మిథైల్‌యూజినాల్, 2 గ్రాముల కార్బోఫ్యూరాన్‌లను కలిపి పొలంలో అక్కడక్కడా వేసుకోవాలి.

కోత విధానం : బొప్పాయి మొక్కలను నాటిన 9వ నెల నుంచి రెండున్నరేళ్లలో కాపుకు వస్తుంది. ఎకరానికి సుమారు 25 నుంచి 30 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. బాగున్న కాయలను చెట్లపై మాగనీయరాదు. భారీ పరిమాణం గల బొప్పాయి కాయలను కోసి న్యూస్ పేపర్లలో చుట్టి మార్కెట్‌కు తరలించాలి.

ఎరువులు వేసుకునే విధానం

ఒక్కో బొప్పాయి మొక్కకు ఒక ఏడాదికి 10 కిలోల పశువుల ఎరువు, 12 కిలోల వేపపిండి, లేదా ఆముదం పిండి, అరకిలో యూరియా, 1.6 కిలోల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, 850 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను రెండు నెలలకోసారి ఏడాదంతా ఆరుసార్లు వేసుకోవాలి. డ్రిప్ ద్వారా ఎరువులను అందించాలంటే 13.5 గ్రాముల యూరియా, 10.5 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను వారం వ్యవధిలో 48 వారాల పాటు అందించాలి. తేలికపాటి నేలల్లో జింక్, ధాతు లోపాలు ఎక్కువ కనిపిస్తుంటాయి. వీటి నివారణకు లీటర్ నీటికి ఒక గ్రాము బోరాక్స్, 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి పిచికారీ చేయాలి.